సాక్షి విశాఖపట్నం

సోమవారం । 19 । జూన్ । 2023



కాయలు చెట్లకే!
కోవిడ్ నుంచి మామిడి రైతుకు కష్టకాలం దాపురించింది. అరకొర కాపుతో పాటు ఎగుమతులు సరిగా జరగడం లేదు. IIలో



పలు రైళ్ల రద్దు
ట్రాక్‌ల నిర్వహణ, లింక్ రైళ్ల రాకపోకల ఆలస్యం వల్ల ఆయా స్టేషన్లలో బయల్దేరాల్సిన పలు రైళ్లు రద్దయ్యాయి. IIలో



సురక్షితంగా మత్స్యకారులు
చేపల కంచేరు సమీపంలో ఓ బోటు ప్రమాదానికి గురైంది. రెస్క్యూ ఆపరేషన్ చేసి వారిని సురక్షితంగా తీసుకుకొచ్చారు. IIలో

న్యూస్‌రీల్

సరకు హ్యాండ్లింగ్‌లో పోర్టు సరికొత్త రికార్డు



పోర్టులో సరకు హ్యాండ్లింగ్ చేస్తున్న దృశ్యం

సాక్షి,విశాఖపట్నం: సరకు **హ్యాండ్లింగ్‌లో** విశాఖపట్నం పోర్టు అథారిటీ**(వీపీఏ) సరికొత్త** రికార్డు నెలకొల్పింది. పోర్టు**లో కార్యకలాపాలు** ప్రారంభమైనప్పటి నుంచి **తొలిసారిగా అత్య**ధిక సరకు రవాణా చేసిన **ఘనత సాధించింది.** శనివారం నుంచి 24 గంట**ల కాల వ్యవధిలో** 4,01,875 మెట్రిక్ టన్నుల **సరకును 23** షిప్పుల నుంచి వివిధ బెర్తుల **ద్వారా హ్యాండ్లిం**గ్ చేసింది. ఒక్క రోజులో అత్యధిక హ్యాండ్లింగ్ చేసిన రికార్డ్‌ను తిరగరాసింది. ఈ ఏడాది మే 7వ తేదీన 27 షిప్‌ల నుంచి 3,78,760 మెట్రిక్ టన్నుల సరుకు హ్యాండ్లింగ్ ఇప్పటి వరకు ఒక్క రోజులో చేసిందిగా రికార్డుల్లో ఉంది. దాన్ని అధిగమించడంపై పోర్టు చైర్మన్ డా.ఎం.అంగముత్తు ట్రాఫిక్ సిబ్బందిని ప్రశంసించారు. పోర్టు సిబ్బంది కలిసికట్టుగా పనిచేయడం ద్వారా మరిన్ని కొత్త రికార్డులను తిరగ రాయవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ఘనతను సాధించడంలో కృషి చేసిన సిబ్బందికి డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, కార్యదర్శి వేణుగోపాల్ అభినందించారు.

విద్యుత్ బిల్లులపై ఫేక్ లింక్స్ నమ్మొద్దు

ఈపీడీసీఎల్ అధికారుల విజ్ఞప్తి

సాక్షి, విశాఖపట్నం : బిల్లులు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ కట్ చేసేస్తామంటూ రాత్రి సమయంలో వస్తున్న ఫోన్ కాల్స్, ఫేక్ లింక్స్, మెసేజ్‌లను వినియోగదారులు విశ్వసించవద్దని ఏపీఈపీడీసీఎల్ అధికారులు విజ్ఞప్తి చేశారు. బిల్లులు చెల్లించకపోతే ఫ్యూజ్‌లు వెంటనే తీసేస్తామంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని సూచించారు. ఈపీడీసీఎల్ సిబ్బంది, కాల్ సెంటర్ నుంచి బిల్లుల చెల్లింపుపై సాయంత్రం 5 నుంచి ఉదయం 8 గంటల మధ్యలో ఎలాంటి కాల్స్, మెసేజ్‌లు, లింక్స్ రావన్నారు. గూగుల్ ప్లేస్టోర్‌లో ఉన్న ఈస్ట్రన్ పవర్ యాప్, భీమ్ యాప్, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే, నెఫ్ట్/ఆర్టీజీఎస్, టీఏ వాలెట్, బిల్ డెస్క్, పే యూ వెబ్ ద్వారా మాత్రమే బిల్లులు చెల్లించాలని సూచించారు.


ఉత్కల్ రథయాత్ర వేడుక రేపు



మాట్లాడుతున్న నాయక్

బీచ్ రోడ్డు: జగన్నాథ రథయాత్ర వేడుక మంగళవారం ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్టు సమాజ్ అధ్యక్షుడు జితేంద్ర కుమార్ నాయక్ తెలిపారు. సిరిపురంలోని ఉత్కల్ సమాజ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దసపల్లాహిల్స్‌లోని జగన్నాథ స్వామి ఆలయం నుంచి జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్ర ఉత్సవమూర్తులు అధిరోహించిన రథాన్ని సిరిపురం, హెచ్‌పీసీఎల్ బంకు, ఏయూ అవుట్ గేట్, చినవాల్తేరు, వుడా పార్కు, శాంతి ఆశ్రమం మీదుగా లాసన్స్‌బే కాలనీలోని శ్రీగుండిడా ఆలయం వరకు ఊరేగింపుగా భక్తులు లాగుతారన్నారు. అక్కడ 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం ఈ నెల 28న బహుదా యాత్ర ద్వారా ప్రధాన ఆలయానికి తిరిగి రథం చేరుకుంటుందన్నారు. సమావేశంలో సమాజ్ ప్రధాన కార్యదర్శి బిమల్‌కుమార్, మహంత్ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్షా 50 వేల విరాళం



ఏఈవోకి విరాళం అందజేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన ఆర్.సుబ్బారావు కుటుంబ సభ్యులు రూ.లక్ష, ఆర్.గోపాలకృష్ణ కుటుంబ సభ్యులు రూ.50 వేలు అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ ఏఈవో వెంపలి రాంబాబుకు ఆదివారం అందించారు. వారిచే అమ్మ వారికి విశేష పూజలు చేయించి, వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు.

అడ్వాన్స్‌డ్‌లో అదరగొట్టారు

దేశ వ్యాప్తంగా ఐఐటీల్లో ప్రవేశాల కోసం ఈ నెల 4న నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు అదరగొట్టారు. పలువురు విద్యార్థులు వివిధ కేటగిరిల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. పక్కా ప్రణాళికతో చదివామని, అధ్యాపకుల సూచనలు, సలహాలు ఉపయోగపడ్డాయని చెబుతూనే.. భవిష్యత్ లక్ష్యాలను 'సాక్షి'తో పంచుకున్నారు.



నాగేంద్ర జశ్వంత్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్ కావడమే లక్ష్యం

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 145వ ర్యాంకు, కేటగిరీలో 54వ ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉంది. ఈ ర్యాంకు ద్వారా తిరుపతి ఐఐటీలో చేరాలనుకుంటున్నాను. ఈసీఈ, ఈఈఈలలో ఏదైనా కోర్సులో చేరి మంచి ఉద్యోగం చేయాలనుకుంటున్నాను. నాన్న భీశెట్టి శ్రీధర్ ఇండియన్ నేవీలో ఉద్యోగి. అమ్మ తేజ సంతోషి కుమారి గృహిణి. వారి ప్రోత్సాహంతోనే ఈ ర్యాంకు సాధించగలిగాను.

– నాగేంద్ర జశ్వంత్, 145వ ర్యాంకర్

మెకానిక్ కుమారుడి అద్భుత ప్రతిభ

గాజువాక: జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో గాజువాకకు చెందిన బైక్ మెకానిక్ కుమారుడు అద్భుత ప్రతిభ ప్రదర్శించాడు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో అలిండియా 1,735వ ర్యాంకు సాధించగా, కేటగిరీ ర్యాంకులో 292ను సొంతం చేసుకున్నాడు. ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చేయాలన్న లక్ష్యంతో కష్టపడి చదివిన పీలా రత్నహర్ష.. ఇటీవల వెలువడిన ఏపీఈఏపీ ఫలితాల్లో 201వ ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. తమ బిడ్డ సాధించిన ర్యాంకుతో అతడి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తొలి నుంచి చదువులో రాణిస్తున్న హర్ష ఇంటర్మీడియట్‌లో 977 మార్కులు సాధించాడు. అతడి తండ్రి పీలా **నాయుడు గాజువాక బీసీ రోడ్‌లో బైక్, ఆటో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. తల్లి భాగ్యలక్ష్మి గృహిణి. చదువులో తన బిడ్డ ఆసక్తిని గమనించి తన శక్తికి** మించి మంచి కళాశాలలో చదివించానని, తన బిడ్డ అనుకున్నది సాధించడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా నాయుడు పేర్కొన్నారు.



హర్ష, 292వ ర్యాంకర్

కంప్యూటర్స్ సైన్స్ నా కల
'ఐఐటీలో కంప్యూటర్స్ సైన్స్ చేయాలన్నది నా కల. అది నెరవేర్చుకోవడం కోసం కష్టపడ్డాను. నా పట్టుదలను చూసి నా తల్లిదండ్రులు కష్టపడి నన్ను చదివించారు. ఉన్నత స్థానంలో నన్ను చూడాలనుకొంటున్నారు. మంచి ర్యాంకు రావడం ఆనందంగా ఉంది.' అని హర్ష తెలిపాడు.

ఎస్‌ఐ కుమారుడికి 274వ ర్యాంకు



అనిరుధ్

సీతమ్మధార: జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 ఫలితాల్లో సీతంపేటకు చెందిన సనపల అనిరుధ్ 274వ ర్యాంకు సాధించాడు. తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో అనిరుధ్ టాపర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. అతని తండ్రి సనపల ఖగేశ్వరరావు పోర్టుటౌన్ క్రైం ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. తల్లి ఝాన్సీ గృహిణి. పదో తరగతిలో 10/10 పాయింట్లు, ఇంటర్‌లో 982/1000, జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా 122వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 25వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా అనిరుధ్ మాట్లాడుతూ ముంబయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతానని చెప్పాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మంచి ర్యాంకు సాధించానని, నాకు చదువు చెప్పిన అధ్యాపకులు, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపాడు.

ఐఏఎస్ నా డ్రీమ్



జేఈఈ అడ్వాన్స్‌డ్- 2023 ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో 444వ ర్యాంకు సాధించాను. హైదరాబాద్‌లో కంప్యూటర్ సైన్స్ చదువుతా. తర్వాత సివిల్స్‌కు ప్రిపేర్ అవుతాను. ఐఏఎస్ అవ్వాలన్నదే నా డ్రీమ్.

– సుభాషిష్ వర్మ ముద్దునూరు

సివిల్స్ నా లక్ష్యం..



జేఈఈ అడ్వాన్స్‌డ్- 2023 ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో 316వ ర్యాంకు సాధించాను. చైన్నైలో కంప్యూటర్ సైన్స్ చదువుతా. తర్వాత సివిల్స్‌కు ప్రిపేర్ అవుతాను. ఐఏఎస్ అవ్వాలని గోల్ పెట్టుకున్నా.

– వెన్నెల యశస్వి నాయుడు

రోజుకు 16 గంటలు చదివాను



ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 128వ ర్యాంకు సాధించాను. నా కష్టానికి తగిన ఫలితం దక్కింది. రోజుకు 16 గంటలు చదివేవాడిని. కేవలం ఆరు గంటలే పడుకునే వాడిని. ఫిట్జీ మెటీరియల్, అధ్యాపకుల గైడెన్స్ ర్యాంకు సాధనకు బాగా ఉపయోగపడింది. కేంద్రీయ విద్యాలయంలో టెన్త్ వరకు చదివాను. ఇంటర్ ఫిట్జీలో 98 శాతం మార్కులు, జేఈఈ మెయిన్స్‌లో 99.982 పర్సంటైల్ సాధించాను. ఐఐటీ ముంబయిలో సీఎస్‌ఈ చదువుతా. ఆ తర్వాత విదేశాల్లో మాస్టర్స్ చేస్తాను.

– షేక్ అవేజ్ మొహతాబ్, 128వ ర్యాంకర్

కంప్యూటర్ సైన్స్ చేస్తా..



జేఈఈ అడ్వాన్స్‌డ్ 2023 ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో 131వ ర్యాంకు సాధించడం చాలా ఆనందంగా ఉంది. సీబీఎస్‌ఈలో 10వ తరగతిలో 484, ఇంటర్మీడియట్‌లో 490 మార్కులు సాధించాను. ప్రతిష్టాత్మకమైన ముంబయిలో ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చేస్తాను.

– మేండా వెంకట హర్షవర్ధన్, 131వ ర్యాంకర్

టాప్ ఐఐటీలో చేరుతా..



జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 377వ ర్యాంకు సాధించాను. రోజుకు 15 గంటలు చదివేవాడిని. ఫిట్జీ, మెటీరియల్, ఐఐటీ ప్రోగ్రామ్, అధ్యాపకుల శిక్షణ ర్యాంకు సాధనకు దోహదపడింది. ఇంటర్‌లో 974 మార్కులు, మెయిన్స్‌లో 99.95 పర్సంటైల్ సాధించాను. ముంబయి/రూర్కీ/ఖరగ్‌పూర్ వంటి టాప్ ఐఐటీల్లో కంప్యూటర్ సైన్స్‌లో చేరుతాను.

– పెందేల శ్రీహర్షిత్, 377వ ర్యాంకర్

గిరి బాలుర సత్తా

మధురవాడ: మారికవలసలోని రాష్ట్ర గిరి**జన సంక్షేమ** గురుకుల శిక్షణ సంస్థకు చెం**దిన ముగ్గు**రు విద్యార్థులు జేఈఈ అడ్వా**న్స్‌డ్–2023**లో విశేష ప్రతిభ కనబరిచి.. ఎస్టీ కేటగిరీలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. వీరు దేశంలోని ప్రఖ్యాత ఐఐటీల్లో సీట్లు పొందే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ నుంచి 18 మంది ప్రవేశ పరీక్షకు హాజరు కాగా.. అందరూ అర్హత సాధించారని ప్రిన్సిపాల్ శివప్రసాద్ చెప్పారు. విజేతలను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ అభిషేక్ అభినందించారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



ఉపాధ్యాయుల చక్కని శిక్షణ, అధికారుల ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించాను. అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగుడ మండలంలోని మారుమూల పింపలగూడ మా గ్రామం. తల్లిదండ్రులు అర్జున్, దమయంతి వ్యవసాయ కూలీలు. వారు ఎంతో కష్టపడి నన్ను చదివిస్తున్నారు. నేను మరింత బాగా చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడతా..

– జి.సంతోష్, 487వ ర్యాంకర్

తల్లిదండ్రుల కష్టం వృథా కానివ్వను..



మాది అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంలోని మారుమూల పల్లె ముళ్లమెట్ట. నాన్న సన్యాసిరావు రైతు, అమ్మ సుందరి గృహిణి. వాళ్లు ఎంతో కష్టపడి నన్ను చదివిస్తున్నారు. నాకు ఎస్టీ కేటగిరీలో 583వ ర్యాంకు వచ్చింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవ్వాలనే లక్ష్యంతో చదువుతున్నాను. తల్లిదండ్రుల కష్టం వృథాకానివ్వను.

– కె.సందీప్, 583వ ర్యాంకర్

రోబోటిక్స్ ఇంజినీర్ నా లక్ష్యం



రోబోటిక్స్ ఇంజినీర్ అవ్వాలన్నదే నా లక్ష్యం. అందుకు కష్టపడి చదువుతున్నాను. మాది అల్లూరి సీతారామరాజు జిల్లా జి.కె.వీధి మండలంలోని సీహెచ్ గంగవరం. నాన్న సోమరా, అమ్మ సోమరి వ్యవసాయ కూలీలు. వారు నన్ను బాగా చదివిస్తున్నారు. ఎస్టీ కేటగిరీలో 1,625వ ర్యాంకు వచ్చింది. చాలా ఆనందంగా ఉంది. ఉపాధ్యాయులు చక్కని తర్ఫీదు ఇచ్చారు. ప్రభుత్వం మంచి సదుపాయాలు కల్పించింది.

-పి.మోహన్, 1,625వ ర్యాంకర్

'విక్రాంత్'కు బెర్త్ ఎక్కడ?

రక్షణ రంగంలో మన శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటేలా భారత్ నిర్మించిన అత్యాధునిక విమాన వాహక యుద్ధనౌక ఐఎన్‌ఎస్ విక్రాంత్. ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతమిస్తూ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ బాహుబలి యుద్ధనౌకను కొద్ది నెలల కిందట ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. త్వరలోనే విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళ అమ్ములపొదిలో ఇది చేరే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ఔటర్ హార్బర్‌లో భారీ బెర్త్‌ను ఏర్పాటు చేసేందుకు నేవీ, పోర్టు సిద్ధమవుతున్నాయి.

– సాక్షి, విశాఖపట్నం



ఐఎన్‌ఎస్ విక్రాంత్ యుద్ధ విమాన వాహక నౌక

- త్వరలో తూర్పు నౌకాదళంలోకి ఐఎన్‌ఎస్ విక్రాంత్
- ఔటర్ హార్బర్‌లో ఓ బెర్త్ విస్తరణకు ప్రణాళికలు
- పోర్ట్ అధికారులతో ఈఎన్‌సీ చీఫ్ చర్చలు

విక్రాంత్ స్వరూపం

పొడవు	262 మీటర్లు
వెడల్పు	62 మీటర్లు
ఎత్తు	59 మీటర్లు
వేగం	28 నాటికల్ మైళ్లు
సామర్థ్యం	42,800 టన్నులు
ఖర్చు	రూ.20 వేల కోట్లు

ఐఎన్‌ఎస్ విక్రాంత్.. విజయానికి, శౌర్యానికి గుర్తు. మన దేశ గౌరవానికి ప్రతీక. మన తొలి విమాన వాహక యుద్ధ నౌక. అప్పట్లో ఉన్న విక్రాంత్ కంటే మెరుగైన సాంకేతికతతో రూపొందించిన ఈ బాహుబలి యుద్ధ నౌక భారత్ చేతిలో బ్రహ్మాస్త్రంగా చెప్పుకోవచ్చు. విక్రాంత్ నిర్మాణంలో అత్యాధునిక సాంకేతికతను వాడారు. క్యారియర్ మెషినరీ ఆపరేషన్లు, షిప్ నేవిగేషన్, ఆటోమేటిక్ సర్వైబిలిటీ సిస్టం ఏర్పాటు చేశారు. ఎయిర్‌క్రాఫ్ట్‌కు అదనపు లిఫ్ట్ ఇచ్చే ఫ్లైట్ డెక్ స్కీ జంప్‌తో స్టోబార్ కాన్ఫిగరేషన్ ఏర్పాటు చేయడం వల్ల అతి తక్కువ సమయంలో టేకాఫ్‌కు వీలవుతుంది. ఏ భాగం మొరాయించినా ఆ ప్రభావం మిగతా భాగాలపై పడదు. దీంతో ప్రయాణం నిరాటంకంగా సాగుతుంది. కేరళలోని కొచ్చి షిప్‌యార్డ్‌లో రెండు వేల మంది షిప్‌యార్డ్ అధికారులు, సిబ్బంది, 13 వేల మంది కార్మికులు, ఉద్యోగులు విక్రాంత్ నిర్మాణంలో భాగస్వాములయ్యారు. 42,800 టన్నుల సామర్థ్యంతో రెండు టేకాఫ్ రన్‌వేలు, ఒక ల్యాండింగ్ స్ట్రిప్‌లతో క్షిపణి దాడిని తట్టుకునేలా నిర్మించారు. విక్రాంత్ నిర్మాణానికి దాదాపు రూ.20 వేల కోట్లు ఖర్చయింది.

త్వరలోనే తూర్పు నౌకాదళంలోకి..
రక్షణ పరంగా, రవాణా పరంగా ఎంతో కీలకమైన హిందూ సముద్రంలో పైచేయి సాధించేందుకు ఐఎన్ఎస్ విక్రాంత్ కీలకంగా మారనుంది. విక్రాంత్ ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ రాకతో బంగాళాఖాతం, అరేబియా సముద్ర జలాలపై మన పట్టు మరింత బిగుస్తుంది. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనే అత్యాధునిక వ్యవస్థ దీని సొంతం. అందుకే విక్రాంత్‌ను కీలకమైన తూర్పు నౌకాదళానికి కేటాయించాలని రక్షణ మంత్రిత్వ శాఖ ముందుగానే నిర్ణయించింది. రాత్రి సమయంలోనూ మిగ్ విమానాలు, ఇతర ఎయిర్‌క్రాఫ్ట్‌లు విక్రాంత్‌పై ల్యాండింగ్, టేకాఫ్‌లను ఇటీవలే విజయవంతంగా నిర్వహించాయి. మరోసారి కొచ్చి షిప్‌యార్డులో తుది ట్రయల్స్ నిర్వహించిన తర్వాత.. విశాఖకు విక్రాంత్ రానుంది. ఈ ఏడాది చివరిలోనైనా లేదా 2024 తొలి నాళ్లలోనైనా.. తూర్పు నౌకాదళం నుంచి రక్షణ బాధ్యతలు చేపట్టనుందని ఇటీవలే భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ స్పష్టం చేశారు.

బెర్త్ మ్యాపింగ్‌లో బిజీబిజీ
సాధారణ యుద్ధ విమానాల కంటే.. భారీగా ఉండే విక్రాంత్ ఎయిర్‌క్రాఫ్ట్ కోసం ప్రత్యేక బెర్త్ అవసరమవుతుంది. ఇప్పటివరకు తూర్పు నౌకాదళంలో 105 మీటర్ల పొడవు ఉన్న యుద్ధ నౌకలే అతి పెద్దవిగా ఉన్నాయి. వీటికి రెట్టింపు పొడవుతో విక్రాంత్ తయారైంది. 262 మీటర్ల పొడవు, 62 మీటర్ల వెడల్పు, 59 మీటర్ల ఎత్తుతో విక్రాంత్ నిర్మించారు. 14 అంతస్తులున్న ఈ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌లో మొత్తం 2,300 కంపార్ట్‌మెంట్‌లున్నాయి. గంటకు 28 నాటికల్ మైళ్ల వేగంతో దూసుకుపోయే విక్రాంత్‌ను విశాఖలో ఎక్కడ బెర్తింగ్ చేయాలన్న దానిపై తూర్పు నౌకాదళాధికారులు సమాలోచనలు చేస్తున్నారు. భారీ బెర్త్ నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ, తూర్పు నౌకాదళం పక్కపక్కనే ఉండటంతో ఎలాంటి భద్రతా లోపం లేకుండా.. విక్రాంత్ కోసం ప్రత్యేక బెర్త్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం పోర్టు చైర్మన్ డా.అంగముత్తుతో ఇటీవలే తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా సమావేశమై చర్చించారు. ఔటర్ హార్బర్‌లోని ఓ బెర్త్‌ను విస్తరించి.. ప్రత్యేకంగా విక్రాంత్‌కు కేటాయించాలని భావిస్తున్నారు. ఇందుకోసం అవసరమైన ప్రణాళికలు, మ్యాపింగ్ సిద్ధం చేసే పనిలో నౌకాదళాధికారులు తలమునకలయ్యారు. మరో రెండు నెలల్లో దీనికి సంబంధించిన రూట్ మ్యాప్ సిద్ధమయ్యాక.. రక్షణ మంత్రిత్వ శాఖకు పంపిస్తారు. అనుమతులు మంజూరైన వెంటనే.. పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు.

శారదా పీఠాన్ని సందర్శించిన కలెక్టర్ మల్లికార్జున

సింహాచలం: శారదా పీఠాన్ని ఆదివారం కలెక్టర్ మల్లికార్జున సందర్శించారు. రాజశ్యామల అమ్మవారికి పూజలు నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. జూలై 3 నుంచి చాతుర్మాస దీక్ష చేపట్టేందుకు స్వామీజీ ఈ నెల 21న రిషికేష్ బయలుదేరి వెళ్తుండటంతో కలెక్టర్ ఆయన్ని కలిశారు.



స్వామీజీ ఆశీస్సులు తీసుకుంటున్న కలెక్టర్

నేటి నుంచి వారాహి నవరాత్రులు

సీతంపేట: లలితా పీఠాధిపతి కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి ఆశీస్సులతో ఈ నెల 19 నుంచి 28 వరకు వారాహి నవరాత్రులు జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. 23న శుక్రవారం సాయంత్రం 7 గంటలకు వారాహి హోమం జరుగుతుందన్నారు. హోమంలో పాల్గొనే వారు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా ఎంఈవో-2 కౌన్సెలింగ్

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 39 మండలాల్లో పోస్టింగ్
- నేడు విధుల్లో చేరనున్న ఎంఈవోలు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: ప్రతీ మండలంలో రెండో ఎంఈవో పోస్టు భర్తీ కోసమని ఆదివారం విశాఖపట్నం డీఈవో కార్యాలయంలో నిర్వహించిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ డీఈవో ఎల్.చంద్రకళ నేతృత్వంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 46 మండలాల్లో ఎంఈవో-2 పోస్టు భర్తీ కోసమని జెడ్పీ హైస్కూళ్లలో పని చేస్తున్న గ్రేడ్-2 హెచ్‌ఎంలకు అవకాశం కల్పించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో జెడ్పీ హైస్కూళ్లలో అర్హులైన 267 మందితో సీనియారిటీ జాబితాను ముందుగా ప్రకటించారు. దీనిపై అభ్యంతరాలు స్వీకరించిన తరువాత ఫైనల్ జాబితా మేరకు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. 39 మంది గ్రేడ్ -2 హెచ్‌ఎంలు ఎంఈవో-2గా ఉద్యోగోన్నతి తీసుకునేందుకు ముందుకొచ్చారు. నిబంధనల మేరకు వారికి కౌన్సెలింగ్ పద్ధతిన కోరుకున్న మండలాల్లో ఎంఈవో-2గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఇంకా 7 మండలాల్లో ఎంఈవో-2 పోస్టులు ఉద్యోగోన్నతిపై భర్తీ చేయాల్సి ఉందని డీఈవో చంద్రకళ తెలిపారు. అందరికీ అవకాశం కల్పించడం జరిగిందని, అయితే 39 మంది మాత్రమే ముందుకొచ్చి విల్లింగ్ ఇవ్వటంతో వారికి ఉద్యోగోన్నతులు కల్పించామన్నారు. ఉద్యోగోన్నతులు పొందిన వారంతా సోమవారం నుంచి విధుల్లో ఉంటారు. డిప్యూటీ డైరెక్టర్ జి.లక్ష్మణరావు, డెప్యూటీ డీఈవో గౌరీ శంకర్, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై నిరంతర నిఘా

- ప్రజల భద్రతకు భంగం కలిగిస్తే పీడీ యాక్ట్, నగర బహిష్కరణ
- పోలీస్ అధికారులకు సీపీ త్రివిక్రమ్ వర్మ ఆదేశాలు



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: నగరంలో ప్రతి రౌడీషీటర్‌పై నిరంతర నిఘా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ పోలీస్ అధికారులకు ఆదేశించారు. ఆదివారం పోలీస్ సమావేశ మందిరంలో అన్ని పోలీస్‌స్టేషన్ల లా అండ్ ఆర్డర్, క్రైం ఇన్‌స్పెక్టర్లతో పాటు స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ అధికారులతో ప్రత్యేక సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లు, గంజా పెడ్లర్లు, పీడీ యాక్ట్ ప్రతిపాదనలు, ప్రాధాన్యత ఇవ్వాల్సిన క్విక్ ట్రయిల్ కేసుల వివరాలపై సమీక్షించారు. నగరంలో ఉన్న ప్రతి రౌడీషీటర్‌పై ఉన్న కేసుల వివరాలను పోలీస్‌స్టేషన్ల వారీగా పరిశీలించారు. వారిపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రౌడీషటర్లపై వ్యక్తిగతంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు. నగర భద్రత, స్వేచ్ఛకు భంగం కలిగేలా ప్రవర్తిస్తున్న రౌడీషీటర్లపై పీడీ యాక్ట్ ప్రతిపాదనలు, నగర బహిష్కరణ ప్రతిపాదనలు చేశారు. ఇటీవల జరిగిన కిడ్నాప్ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పద్మనాభం స్టేషన్ కానిస్టేబుల్ ఎం.శ్రీను, వి.సాయిబాబాలకు సీపీ ప్రశంసా పత్రాలు అందజేశారు.

గిరి ప్రదక్షిణ మార్గంలో అధికారుల పర్యటన

సింహాచలం: వచ్చే నెల 2న జరిగే గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని దేవస్థానం, పోలీస్ అధికారులు, దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆదివారం గిరి ప్రదక్షిణ మార్గంలో ఏర్పాట్లపై పరిశీలన జరిపారు. ఈ మార్గంలో ఏర్పాటు చేయాల్సిన స్టాళ్లు, భక్తులకు సౌకర్యాలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లపై చర్చించారు. భక్తుల రద్దీ ఏయే ప్రాంతంలో ఎక్కువగా ఉంటుందో అంచనా వేశారు.



గిరి ప్రదక్షిణ మార్గంలో పరిశీలన చేస్తున్న పోలీసులు, దేవస్థానం అధికారులు

నేడు జీవీఎంసీలో 'జగనన్న కు చెబుదాం'

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 'జగనన్నకు చెబుదాం'(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

శ్రీ విశ్వ విజయకేతనం

సీతంపేట: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీవిశ్వ విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. పలు కేటగిరీల్లో ఎం.కార్తీక్ 40వ ర్యాంకు, ఎం.డి.ఫర్హాన్ 62, ఎస్.సత్యసాయి 141, ఆర్.నవ్య 357, ఎస్.వెంకట సాయి వివేక్, 498, వి.పవన్ 651 ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో 5వేల లోపు 31 ర్యాంకులు, 10వేల లోపు 36 ర్యాంకులు సాధించామని వెల్లడించారు.

కాయలు చెట్లకే!



ఈ ఫొటోలోని రైతు పేరు రెడ్డిపల్లి శంకర్రావు. విశాఖ జిల్లా పద్మనాభం మండలం, శేరిఖండం గ్రామానికి చెందిన ఈయనకు ఏడెకరాల్లో మామిడితోటలున్నాయి. ఈ ఏడాది తన మామిడితోటల ఎరువులకు రూ.50 వేలు, మందులు, దుక్కులు, ఇతర ఖర్చులకు మరో రూ.50 వేలు వెరసి రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. కానీ రూ.30 వేల ఆదాయం కూడా రాలేదు. మార్కెట్లో ప్రస్తుతం క్రేట్ (25 కిలోలు) నాణ్యమైన మామిడికాయలు రూ.250-300కి మించి కొనుగోలు చేయడం లేదు. కోత కూలి, రవాణా చార్జీ సైతం గిట్టుబాటు కాక పక్వానికి వచ్చిన మామిడిని కూడా చెట్లకే వదిలేస్తున్నామని శంకర్రావు ఆవేదన చెందుతున్నాడు.



చెట్లకు కాసిన కాయలు

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన పిల్లి పెద్దకాపుదీ అదే పరిస్థితి. ఈయన మూడెకరాల మామిడితోటను కొనుగోలు చేశాడు. గడచిన రెండేళ్లు కాపు అంతంతమాత్రంగానే కాసింది. ఈ ఏడాదీ సగమే కాపు కాసింది. మొదట్లో ఒకింత మంచి ధరే పలికింది. కానీ అప్పటికి కాయలు పక్వానికి రాలేదు. ఇప్పుడు పక్వానికొచ్చాక కొనే వారే కరువయ్యారు. మార్కెట్‌కు గాజువాక మార్కెట్‌కు ఆటోలు/వ్యానుల్లో తరలిస్తే రవాణా చార్జీలు, కూలి సొమ్ము రావడం లేదని, దీంతో కోయకుండా చెట్లనే కాయలు వదిలేశానని, ఎవరైనా ఉచితంగా తీసుకెళ్లమని చెబుతున్నానని పెద్దకాపు చెబుతున్నాడు.

- మామిడిని కోయకుండానే వదిలేస్తున్న రైతులు
- కోత కూలి, రవాణా చార్జీలు గిట్టుబాటు కాని పరిస్థితి
- ఈ ఏడాది ఎగుమతులు లేని ఫలితం
- టన్నుకు రూ. 10 వేలు కూడా దక్కని దైన్యం
- ధర లేక కుదేలైన మామిడి రైతు

సాక్షి, విశాఖపట్నం: ఇలా శంకర్రావు, పెద్దకాపులదే కాదు.. చాలా మంది మామిడి రైతులది ఇదే పరిస్థితి. కోవిడ్ నుంచి మామిడి రైతుకు కష్టకాలం దాపురించింది. కోవిడ్ మూడేళ్లూ అరకొర కాపుతో పాటు మామిడి ఎగుమతులు సరిగా జరగలేదు. ఈ ప్రాంతం నుంచి పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. ఆ ప్రాంత వర్తకులు స్థానిక వ్యాపారులు, దళారుల ద్వారా కొనుగోలు చేసి లారీలు, వ్యాగన్లలో ఆయా రాష్ట్రాలకు తరలిస్తుంటారు. ఇలా సగం పంట ఎగుమతులకు పోను మిగిలినది స్థానిక మార్కెట్లలో విక్రయిస్తారు. ఈ ఏడాది కాపు ఆలస్యమైనా ఎగుమతులు బాగుంటాయని మామిడి రైతులు ఆశించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 15,212 హెక్టార్లలో మామిడి తోటలున్నాయి. వీటి ద్వారా లక్షా 38 వేల టన్నుల దిగుబడి వస్తుందని ఉద్యానశాఖ అధికారుల అంచనా. కానీ ఈ సీజనులోనూ కాపు 50 శాతానికి మించలేదు. కాపు ఆలస్యంగా రావడంతో ఆరంభంలో టన్ను బంగినపల్లి, రసాలు వంటి రకాలకు రూ.80 వేల నుంచి లక్ష వరకు ధర పలికింది.



పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో పక్వానికి వచ్చినా కోయకుండా చెట్లనే వదిలేసిన దృశ్యం

ప్రస్తుతం అది రూ.7-8 వేలకు పడిపోయింది. గతంలో 25 కిలోల క్రేట్ రూ.1,000-1,500 పలకగా ఇప్పుడది రూ.250-300కి దిగజారింది. ఈ ఏడాది కూడా ఎగుమతులు లేకపోవడంతో మార్కెట్లో రూ.100కి 3 కిలోలు విక్రయించగా, ఇప్పుడు ఐదారు కిలోలు లభిస్తున్నాయి. కొన్నాళ్లుగా మార్కెట్లో ఇవి ఇబ్బడిముబ్బడిగా దర్శనమిస్తున్నాయి.

ఖర్చు తడిసి మోపెడు..

ఈ పరిస్థితుల్లో రైతులు తమ చెట్ల నుంచి మామిడికాయలను కోసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ కాయలు కోయడానికి చెట్లు ఎక్కే నైపుణ్యం ఉన్న కూలీలే ఉండాలి. వీరికి రోజుకు రూ.700 కూలి, మధ్యాహ్నం భోజనంతో పాటు సాయంత్రం మద్యం ఇస్తేనే పనికి వస్తున్నారని రైతులు చెబుతున్నారు. మార్కెట్లో ధర లేకపోయినా కోత కూలీలకు వీటిని సమకూర్చాల్సిందే. కోసిన కాయలను మార్కెట్‌కు వ్యాన్లు, ఆటోల్లో తరలిస్తారు. ఇలా ఒక్కో క్రేట్‌కు కోతకు రూ.50, మందులు, ఎరువులకు రూ.50, రవాణా చార్జి రూ.100, ఆశీలు రూ.30 వెరసి రూ.230 వరకు ఖర్చవుతుంటే రూ.250 కూడా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీంతో శ్రమపడి కోసేకంటే చెట్లను వదిలి పెట్టడమే నయమన్న భావనతో పక్వానికి వచ్చినా కోయడం లేదు. మూడు, నాలుగేళ్ల నుంచి మామిడి అరకొర దిగుబడి, ఆశాజనకంగా లేని ధరతో కుదేలవుతున్నామని మామిడి రైతులు ఎంతో ఆవేదన చెందుతున్నారు.

మాతృమూర్తి పురస్కారాల ప్రదానం



మాతృమూర్తి పురస్కారాలు అందుకున్న వారితో అతిథులు

సీతంపేట: మాతృమూర్తులకు, నిస్వార్థంగా సేవలందిస్తున్న కుమారులకు మేడా బుజ్జమ్మ మాతృమూర్తి సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మేడా మస్తాన్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ ఎంపిక చేసిన ఐదుగురికి అతిథుల చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. టీఎస్ రావు, ఉన్నా రాంప్రసాద్, కాకరపర్తి బాలాజీ, కాండ్రేగుల వెంకట సూర్య అప్పారావు, భీశెట్టి శ్రీనివాసరావులకు ముఖ్య అతిథులు ఆచార్య జీఎస్ఎన్ రాజు, రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకులు వి.వి.రమణమూర్తి, సీహెచ్ వివేకానంద, దాడి సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి చేతుల మీదుగా ఘనంగా సత్కరించి మాతృమూర్తి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాఖ్యాత వేముల భాస్కరాచారి, కార్యవర్గ సభ్యులు ఎస్.ఎస్.శాస్త్రి, డి.ఆర్.కె.రావు, వెత్సా రామకృష్ణ, మేడా శివారెడ్డి, మేడా పద్మావతి, టీకే హరిప్రసాద్, పెసల దుర్గాప్రసాద్, కళా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుతూ కుప్పకూలిపోయాడు..!

- గుండెపోటుతో యువ న్యాయవాది మృతి



మణికంఠ నాయుడు

విశాఖ లీగల్: యువ న్యాయవాది మణికంఠ నాయుడు(26) ఆదివారం మధ్యాహ్నం క్రికెట్ ఆడుతూ గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. వివరాలిలా ఉన్నాయి. విశాఖ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా అంతర్ జిల్లా క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బీటీస్ తరఫున మణికంఠ నాయుడు విశాఖ జిల్లా గాజువాక పరిధిలోని జింక్ మైదానంలో మధ్యాహ్నం క్రికెట్ ఆడుతున్నాడు. ఆట ఆడుతూ మైదానంలోనే కుప్పకూలిపోయాడు. పక్కనే ఉన్న సహచరులు అతనిని గాజువాకలోని ఆస్పత్రికి తరలించేలోపే మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఈ మేరకు విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కృష్ణమోహన్, పి.నర్సింగరావు, అరుణ్‌కుమార్, విశాఖ న్యాయవాదుల సంఘం కార్యదర్శి, సహచర క్రీడాకారులు వియ్యపు మురళీకృష్ణ, పవన్ తదితరులు సంతాపం ప్రకటించారు.

ఫిట్జీ విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన ఫిట్జీ విద్యార్థులు

సీతంపేట: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఫిట్జీ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో షేక్ అవేజ్ మెహతాబ్ 128వ ర్యాంకు సాధించి ఉత్తరాంధ్ర టాపర్‌గా నిలిచాడని మేనేజింగ్ పార్టనర్ పెండేల మస్తాన్‌రావు తెలిపారు. ఓపెన్ కేటగిరీలో ఆయుష్ మార్తాండ్ బోర్కర్ 283, పెండేల హర్షిత్ 377, తాడికొండ శ్రీ అవ్యయే 778, ఎం.నితిల్ కవిన్ 1393, పణ్యమంతుల మధ్రున 1714, టి.కెవిన్ 1721, పీలా రత్న హర్ష 1,735, వైభవ్ 1822 ర్యాంకు సాధించినట్లు చెప్పారు. 218 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 88 మంది అర్హత సాధించారని వెల్లడించారు.

శశి విద్యార్థుల హవా



రమహర్షిణి | సాయినారాయణ | అభిరామ్ | గుణ్వంత్ | రాజ్‌కుమార్ | కృష్ణ | సాయిరామ్ | ఆనంద్‌భాస్కర్ | కావ్య

తగరపువలస: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని సంగివలస శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. వివిధ కేటగిరీల్లో ఆలిండియా స్థాయిలో ఎస్.రామహర్షిణి 11వ ర్యాంకు, ఆర్.సాయి నారాయణ 118, కె.అభిరామ్ 152, వి.ఎస్.ఎస్.గుణ్వంత్ 235, వి.రాజ్‌కుమార్ 504, ఆర్.ఎన్.వి.కృష్ణ 751, పి.సాయిరామ్ 802, వి.ఆనంద్ భాస్కర్ 866, బి.కావ్య 991, ఎం.హెచ్.ఎన్.డి.సతీష్ 1135, డి.వి.వి.చైతన్య 1210వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ఓపెన్ కేటగిరీలో వెయ్యి లోపు ఇద్దరు, 5 వేల లోపు నలుగురు, 10వేల లోపు 10 మందికి ర్యాంకులు లభించాయన్నారు. వివిధ కేటగిరీల్లో వెయ్యి లోపు 9 మంది, 5వేల లోపు 35 మంది, 10వేల లోపు 46 ర్యాంకులు వచ్చినట్లు వివరించారు. ర్యాంకర్లను వైస్ చైర్మన్ నరేంద్ర కృష్ణ, కరస్పాండెంట్ క్రాంతి సుధ తదితరులు అభినందించారు.

తిరుమల విజయదుందుభి



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో తిరుమల విద్యాసంస్థల యాజమాన్యం

తగరపువలస : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తాళ్లవలస తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. పలు కేటగిరీల్లో వి.శ్యామ్‌శ్రీ వర్ధన్ 5వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. పి.యశ్వంత్ శ్రీనివాస్ 73, ఎస్.యశ్వంత్ 90, పి.నవీన్‌కుమార్ 271, వి.వేణు 308, కె.శ్రీచరణ్‌రాజ్ 327, బి.యశ్వంత్ రామ్‌కుమార్ 349 ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. వంద లోపు ముగ్గురు, 300 లోపు నలుగురు, 500 లోపు ఎనిమిది మంది, వెయ్యి లోపు 12 మంది, 1,500 లోపు 18 మంది, 2వేల లోపు 31, 3 వేల లోపు 45, 5 వేల లోపు 62, 10వేల లోపు 82 మంది ర్యాంకులు సాధించగా.. సుమారు 65 మందికి ఐఐటీ సీట్లు వస్తాయన్నారు. ర్యాంకర్లను డైరెక్టర్లు ఇ.మృత్యుంజయరావు, కె.ఎస్.వి.వి సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, జి.సతీష్‌బాబు అభినందించారు.

పలు రైళ్ల రద్దు



దారి మళ్లించిన రైళ్లు

తాటిచెట్లపాలెం: ఇటీవల జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద దృష్ట్యా ట్రాక్‌ల నిర్వహణ, లింక్ రైళ్ల రాకపోకలు ఆలస్యం వల్ల ఆయా స్టేషన్లలో బయల్దేరాల్సిన పలు రైళ్లు రద్దయినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఆదివారం షాలిమార్‌లో బయల్దేరాల్సిన షాలిమార్-హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్‌లో బయల్దేరాల్సిన హైదరాబాద్-షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చిలో బయల్దేరాల్సిన సంత్రగచ్చి-తిరుపతి (22855) ఎక్స్‌ప్రెస్, గౌహతిలో బయల్దేరాల్సిన గౌహతి -సికింద్రాబాద్ (02605) ఎక్స్‌ప్రెస్, హౌరాలో బయల్దేరాల్సిన హౌరా-పుదుచ్చేరి (1267) ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్‌లో బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్-సంత్రగచ్చి (22808)ఎక్స్‌ప్రెస్, మైసూరులో బయల్దేరాల్సిన మైసూరు-హౌరా (22818) ఎక్స్‌ప్రెస్, సోమవారం తిరుపతిలో బయల్దేరాల్సిన తిరుపతి-సంత్రగచ్చి(22856) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్‌లో బయల్దేరాల్సిన సికింద్రాబాద్- అగర్తలా (07030) ఎక్స్‌ప్రెస్, ఎర్నాకుళంలో బయల్దేరాల్సిన ఎర్నాకుళం-హౌరా(22878) ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కొనసాగుతున్న నిర్వహణ పనుల నిమిత్తం పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని దారి మళ్లిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

➡ రాజమండ్రి-విశాఖపట్నం-రాజమండ్రి(07466/07467) పాసింజర్ స్పెషల్ ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు ఇరువైపులా రద్దు

➡ కాకినాడ-విశాఖపట్నం-కాకినాడ(17267/17268) ఎక్స్‌ప్రెస్ ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు ఇరువైపులా రద్దు

➡ గుంటూరు-విశాఖపట్నం(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు రద్దు

➡ విశాఖపట్నం-గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు రద్దు

➡ విశాఖపట్నం-విజయవాడ-విశాఖపట్నం (22701/22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు రద్దు.

➡ ఈనెల 20, 23, 24 తేదీల్లో ధన్‌బాద్-అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తుంది.

➡ ఈనెల 20వ తేదీన హతియా-బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తుంది. ఈ నెల 23వ తేదీన టాటానగర్-బెంగళూరు(12889) ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తుంది.

➡ ఈ నెల 24వ తేదీన హతియా-బెంగళూరు(18637) ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తుంది.

సత్తా చాటిన శ్రీ చైతన్య



ప్రతిభ చూపిన విద్యార్థులతో శ్రీ చైతన్య కాలేజీ ప్రతినిధులు

విశాఖ విద్య: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీ చైతన్య ఐఐటీ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయిలో మంచి ర్యాంకులు కైవసం చేసుకున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. దాసరి సాకేత్ నాయుడు 12వ ర్యాంకు, నడిపల్లి సిద్ధార్థ 101, వైశ్యరాజు శ్రీకర్ నిహాల్ 173, మీసాల ప్రణతి శ్రీజ 214, సనపల అనిరుథ్ 274, బోయిన సంజన 282, డోలా సూర్యసాయి 302, కణితి శ్రీ కార్తీక్ 346, బాష్య ధనుష్ సాయి 533, రహ్మాన్ షేక్ జమీల్ 670వ ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. 368 మందికి పైగా శ్రీ చైతన్య ఉత్తరాంధ్ర విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ర్యాంకులు సొంతం చేసుకున్నారని తెలిపారు. నగరంలోని సంస్థ ప్రధాన కార్యక్రమంలో ఆదివారం వీరిని సత్కరించారు. డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని అభినందించారు.

ఎసెంట్ విద్యార్థులకు ర్యాంకులు



తేజ్ కిరణ్, 192వ ర్యాంకర్

మద్దిలపాలెం: జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 ఫలితాల్లో తమ విద్యార్థులు విశిష్ట ఫలితాలు సాధించారని ఎసెంట్ కళాశాల డైరెక్టర్ జి.నాగేశ్వరరావు తెలిపారు. ఆలిండియా స్థాయి ఓపెన్ కేటగిరీలో సీహెచ్ తేజ్ కిరణ్ 192వ ర్యాంక్ సాధించినట్లు చెప్పారు. 540, 577, 695, 731, 769, 910, 955వ ర్యాంకులు ఎసెంట్ విద్యార్థులు సొంతం చేసుకున్నారన్నారు. 5వేల లోపు 40 ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. ఫలితాల సాధనలో కృషి చేసిన కళాశాల అధ్యాపకులు, డైరెక్టర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆయన అభినందన తెలిపారు.

నారాయణ ప్రభంజనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో సంస్థ డీజీఎం హనుమంతరావు

సీతమ్మధార: జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలు మరోసారి విజయకేతనం ఎగురవేసినట్లు సంస్థ డీజీఎం హనుమంతరావు, డీన్ జి.రామలింగేశ్వరరావు తెలిపారు. ఆశీలమెట్టలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడారు. వివిధ కేటగిరీల్లో వందలోపు 7, 16, 22, 36, 37, 49, 67, 69, 78, 82, 94 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించినట్లు చెప్పారు. ఓపెన్ కేటగిరీలో మేండా వి.వెంకట హర్షవర్ధన్ 131వ ర్యాంక్, అనన్య లచ్చుపత్తుల 244, పీలా తేజేశ్వరి 248, వెన్నెల యశస్వి నాయుడు 316, సుభాషిస్ వర్మ ముద్దునూరు 444, పెద్దింటి శ్రీ బాలాజీ అభిషేక్ 472, హనుమంతు నితిన్ 477, సువ్వాడ మౌనిషా నాయుడు 521, పినపాక యశ్వంత్ 891వ ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. ఈ విజయం వెనుక అధ్యాపకుల కృషి ఉందన్నారు. విద్యార్థులను డీజీఎంతో పాటు డీన్ జి.రామలింగేశ్వరరావు, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

అప్పు చెల్లించలేదని వ్యక్తిపై దాడి

పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు



గాయాలతో బాత ప్రసాద్

పెదగంట్యాడ: తమ వద్ద తీసుకున్న డబ్బు తిరిగి చెల్లించడం లేదని ఓ వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో అతని చేతిపై తీవ్ర గాయం కాగా వీపుపై తట్లు తేరిపోయాయి.. మండలంలోని వినాయకనగర్ వుడా కాలనీ ప్రగతి పార్కు సమీపంలోని ఐశ్రీ ట్యూషన్ సెంటర్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన సంచలనం రేకెత్తించింది. న్యూపోర్టు సీఐ ఎస్.రాము తెలిపిన వివరాల మేరకు.. పార్వతీపురం జిల్లా కొమరాడ మండలానికి చెందిన బాత ప్రసాద్ (36) అనే వ్యక్తి 2018 నుంచి 2022 వరకూ గాజువాక ప్రాంతంలో ఉంటూ బియ్యం, ఆయిల్ వ్యాపారం చేసేవాడు. ఈ నేపథ్యంలో ప్రసాద్‌కు గాజువాకకు చెందిన గెద్దం భానుప్రకాశ్, జనపరెడ్డి శ్రీను, భూపతి ఆచారి పరిచయమయ్యారు. భాను ప్రకాశ్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నడుపుతుండగా.. శ్రీను గంగవరం పోర్టులో పనిచేస్తున్నాడు. భూపతి ఆచారి ఐశ్రీ ట్యూషన్ సెంటర్ నడుపుతున్నాడు. వీరి ముగ్గురు వద్ద నుంచి ప్రసాద్ దఫదఫాలుగా రూ.2.85 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బును తిరిగి చెల్లించకుండా గాజువాక నుంచి ప్రసాద్ స్వగ్రామం వెళ్లిపోయాడు. తర్వాత అతనికి ఫోన్ చేసి డబ్బులు అడిగినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం ప్రసాద్ ఐశ్రీ ట్యూషన్ సెంటర్ వద్దకు వచ్చాడు. దీంతో బాకీ పడిన సొమ్ము తిరిగి చెల్లించాలని ముగ్గురూ ప్రసాద్‌పై ఒత్తిడి తీసుకురావడంతో పాటు ట్యూషన్ సెంటర్‌లోని ఓ గదిలో నిర్బంధించారు. డబ్బులు ఎప్పుడు చెల్లిస్తావని ప్రశ్నించారు. దానికి ప్రసాద్ స్పందించకపోవడంతో కర్రలతో వీపుపై కొట్టారు. అయినా ప్రసాద్ నుంచి స్పష్టమైన సమాధానం రాకపోకవడంతో భాను ట్యూషన్ సెంటర్‌లో ఉన్న స్టేషనరీ చాకుతో ప్రసాద్‌పై దాడి చేశాడు. చేతిపై గాయం చేశాడు. దీంతో భయాందోళన చెందిన ప్రసాద్ గట్టిగా కేకలు వేయడంతో స్థానికంగా ఉంటున్న కొందరు ఆ ట్యూషన్ సెంటర్ లోకి వెళ్లారు. అక్కడి పరిస్థితిని చూసి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం గాజువాకలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అతనిపై దాడి చేసిన ముగ్గురితో పాటు వారితో ఉన్న మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అందులో ఇద్దరికి ఈ కేసుతో సంబంధం లేదని, బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాము తెలిపారు.

సురక్షితంగా మత్స్యకారులు

- చేపల కంచేరు సమీపంలో ప్రమాదానికి గురైన బోటు
- మత్స్య శాఖ జేడీ ఆధ్వర్యంలో రెస్క్యూ ఆపరేషన్



ప్రమాదం నుంచి బయటపడ్డ బోటు, మత్స్యకారులు

ఆరిలోవ: సముద్రంలోకి చేపలు వేటకు వెళ్లిన ఓ బోటు చేపల కంచేరు సమీపంలో ప్రమాదానికి గురైంది. మత్స్య శాఖ జేడీ జి.విజయ ఆధ్వర్యంలో మూడు గంటల పాటు జరిపిన రెస్క్యూ ఆపరేషన్‌లో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులంతా సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. నగరానికి చెందిన ఎనిమిది మంది మత్స్యకారులు ఎం.చిన్న అప్పన్నకు చెందిన బోటులో చేపల వేటకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం తిరిగి ఒడ్డుకు వస్తుండగా చేపల కంచేరు సమీపంలో బోటు ప్రమాదంలో చిక్కుకొంది. మత్స్యకారులు తాము ప్రమాదంలో చిక్కుకొన్న విషయం మత్స్య శాఖ జేడీకి సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన జేడీ కోస్టుగార్డుకు సమాచారం ఇచ్చారు. అంతటితో ఆగకుండా ఆమె సాయంత్రం 6.30 గంటలకు మూడు బోట్లతో చేపల కంచేరు సమీంలో ప్రమాదంలో చిక్కుకున్న బోటు వద్దకు చేరుకున్నారు. అక్కడ బోటుతో పాటు ఎనిమిది మంది మత్స్యకారులను రక్షించి సురక్షితంగా హార్బర్‌కు చేర్చారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన ఈ రెస్క్యూ ఆపరేషన్ 9.30 గంటలు వరకు విజయవంతంగా కొనసాగినట్లు జేడీ విజయ తెలిపారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్ (10 గ్రా.)	రూ.60,110
22 క్యారెట్స్ (10 గ్రా.)	రూ.55,100
వెండి (కిలో):	రూ.78.800

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	550.00
విజయనగరం	554.00
శ్రీకాకుళం	554.00

చికెన్ (కిలో)

ఫారం ధర	: రూ.137
బ్రాయిలర్ (లైవ్)	: రూ.157
స్కిన్	: రూ.284
స్కిన్ లెస్	: రూ.294